# మేడ

పొద్దున్నే వుదయించిన సూర్యుడితోపాటు, నవ్వు మొహంతో నిద్రలేచిన భానుమూర్తి, సూర్యుడస్తమించిన సాయంత్రానికల్లా మొహం, మనసూ మాడ్చుకున్నాడు.

* * *

భానుమూర్తి ఆ వూరొచ్చి ఆరు రోజులైంది. కాలేజీలో లెక్చరర్‌గా జాయినైన ఐదు రోజులూ, ప్రిన్సిపాలుగారు రికమెండుచేసిన సందులోని గదిలోదిగి నాల్రోజులూ అయ్యేయి.

ఆ గదివున్న సందు చాలా చిన్నది; గదీ చిన్నదే. ముప్ఫై రూపాయ లద్దివ్వడాని కొప్పుకున్న ఆ గదిపైట మూడ్రోజుల్నించీ, కొళాయివగ్గిర వినబడే ఆడవాళ్ళ బూతులు మాత్రం పెద్దవి. వర్షం వచ్చినప్పుడు ఏర్పడి, చాలా రోజుల్దాకా కదలని మురికిగుంటలూ పెద్దవే! అంచేత భానుమూర్తికి ఆ గదంటే రోతపుట్టింది. సొంత వూళ్ళోవున్న 'అమ్మని' తీసుకొచ్చెయ్యాలనీ, అందుకు మంచి ఇంటినిగానీ, పోర్షనుగానీ వెతకాలనే కోరికా పుట్టింది.

వూరొచ్చిన ఏడో రోజుని, బస్సు రూటుకోసం ఎడంపక్క వెళ్ళడం మానేసి షై ముంది కదాని కుడిపక్క నడవడం ప్రారంభించిన భానుమూర్తి ఆ సందుదాటి మరో పెద్దసందు చివరకొచ్చి తక్కున ఆగిపోయాడు. అక్కడ వో అందమైన మేడవున్నది. రెండో అంతస్తుమీద చక్కని రెండుగదులు భానుమూర్తి రెండుకళ్ళకీ రెండు చిన్న సైజు

స్వర్గాల్లా కనిపించాయి. అన్నింటికన్నా ముఖ్యంగా ఆ గోడలకి వేసిన గులాబీరంగు, అతను ఆనర్సు చదువుతున్న రోజుల్లో ప్రేమించిన సరోజ జళ్ళో రోజాలా అందంగా కనిపించింది. ఆ గదులకు వేసిన తాళాలు, తన పేదరికం, స్వర్గపు గేటుకువేసిన సీళ్ళలా కనిపించేయి. మొత్తం మీద ఆ మేడ తీరని కోరికలా అతి హుందాగానూ, తీరబోయే కోరికలా అతి అందంగానూ వుంది. అనుకోకుండానే ఆ గదు లప్పుడే తనద్దెకు తీస్కున్నట్టు ఫీలయేడు భానుమూర్తి. అప్పటి కాలోచనాపేసి తిన్నగా కాలేజీకి వెళ్ళిపోయాడు.

సాయంత్రం క్లాసులైపోగానే, కాఫీతాగి, ఆ మేడవున్న ఇంటి గేటుతీసి లోపలికెళ్ళిన భానుమూర్తి, "ఎవరండీ?" అని మొగమాటంగా పిల్చేడు. ఎవరూ పలకలేదు. "ఏవండీ" అని మరోమారు పిల్చేడు.

"ఎవరూ!" అంటూ బైటకొకాయన వచ్చేడు. ఆయన ఆరడుగుల పొడుగున్నాడు. చూడగానే నమస్కరించాలనే భావం కలిగించేలా వున్నాడు. రాగానే "ఎవరు కావాలి?" అనడిగేడు.

"నాపేరు భానుమూర్తండీ! ఈ వూరి కాలేజీలో కొత్తగా లెక్చరర్‌గాచేరేను."

"అలాగా! ఇక్కడెవరికీ ట్యూషన్లక్కర్లేదు" అన్నాడాయన గంభీరంగా.

"అహఁ! అదికాదండీ!.... ఈ మేడమీద గదులద్దెకొకావాలని...." ఆయన వో రెణ్ణిమిషాలూరుకున్నాడు. "అవి అద్దెకివ్వం" అన్నాడు. భానుమూర్తి ఉత్సాహమంతా చచ్చిపోయింది. కాఫీ తాగి అప్పుడే ముట్టించబోయిన గోల్డుఫ్లేక్ సిగరెట్టు రోడ్డుమీదకి జారిపోయినట్టు ఐంది.

"అది కాస్సార్! అందులో ఎవరూ వుండటం లేదుగా. అది మీరద్దికిస్తే మా వూర్నుంచి మాఅమ్మగార్ని తీస్కొద్దామనుకుంటున్నాను." అన్నాడు భానుమూర్తి చాలా దీనంగా.

ఆయన కొంచెం తల అడ్డంగా తిప్పి, "క్షమించండి...." అన్నాడు ఇంకా ఏదో అనబోయాడు. భానుమూర్తి ఏఁవీఁ అనకుండా వచ్చేశాడు. బయటకొచ్చి సిగరెట్టు ముట్టించి ఆకాశం వేపు చూశాడు.

ఆకాశంలో సూర్యుడప్పుడే అస్తమిస్తున్నాడు.

పొద్దున్న సూర్యోదయంతోబాటు భానుమూర్తి మొహంలో వెలిగిన చిరునవ్వు ఆ వేళ అలా, సూర్యుడిఅస్తమయంతోబాటు ఆరిపోయింది.

* * *

మరో వారంరోజులు వరసగా వెనక్కి వెళ్ళిపోయేయి. మరో నాల్రోజులుపోతే 'దసరా' వస్తుందని కాలేజీకి సెలవులిచ్చేసారు. దసరాకి రమ్మని అమ్మ రాసిన వుత్తరం ఆ వేళ పోస్టుమేనిచ్చేశాడు. బావు లేని మనసు అమ్మ దగ్గరి కెళ్ళాక కొంచమైనా బావుండొచ్చు. అందుకని ఎయిర్ బేగ్‌లో రెండుజతల బట్టలు పడేస్కొని, రైలుకింక గంట పైముందనగా బస్ స్టాప్‌కి బయల్దేరాడు భానుమూర్తి. కాని అంతలోనే ఎందుకో ఆ మేడ మరోమారు చూడాలనిపించింది.

తనెటువైపు వెళ్ళడంలేదు, కాని ఇవాళ వెళ్ళాలనిపించింది. అందుకని అటుపక్క నడవడం ప్రారంభించాడు భానుమూర్తి.

సందు వెనక్కి వెళ్ళిపోయింది. ఆ మేడ దగ్గరికొచ్చింది.... మేడ ఎదురుగా వచ్చింది.... భానుమూర్తి అకస్మాత్తుగా ఆగిపోయాడు. మేడ పక్క అదోరకంగా చూశాడు. ఆ చూపులో జాలుంది; దీనత్వం వుంది, పోగొట్టుకోకూడన్దాన్ని పోగొట్టుకున్నానన్న భావం వుంది. దీనంగా ముందుకు కదలబోయిన భానుమూర్తికి కుడివైపునించి ఎవరో చప్పట్లు కొట్టినట్టయింది. భానుమూర్తి మేడవైపు చూశాడు. గేటులోపల ముసలాయన నిలబడి వున్నాడు. భానుమూర్తి అటుచూడగానే రమ్మనిపిలిచేడు. భానుమూర్తి దగ్గరగా వెళ్ళేడు.

"సెలవులకి ఊరి కెళ్తున్నారా?" అనడిగాడాయన.

"ఊఁ," అన్నాడు భానుమూర్తి. "మా అమ్మగార్ని తీసుకురావాలి"

"ఇల్లు దొరికిందా?"

"లేదు. కా నేం చేయడం? ఇంటికన్న అమ్మ రావడమే ముఖ్యం!"

ఆయన జాలిగా నవ్వేడు "మీ అడ్రస్సివ్వండి. మూడొంతులు కొద్ది రోజుల్లోనే వుత్తరం రాస్తాను, మీ రొచ్చి దిగిపోవచ్చు."

భానుమూర్తి నమ్మలేనట్టు చూసేడు. "నిజమేనా ?" అన్నాడు.

"నిజమే." అన్నాడాయన నవ్వుతూ.

అప్పుడు మళ్ళీ నవ్విన భానుమూర్తి ఆయనకి సొంతవూరి ఎడ్రసిచ్చి, రైలెక్కి, ఇంటికెళ్ళిందాకా ఆనందంగా నవ్వుతూనే వున్నాడు. వారంరోజుల్లోనే భానుమూర్తికి వుత్తరం వచ్చింది. ఉత్తరం చింపేడు భానుమూర్తి.

"నాయనా !

ఏమిటి రాయాలో, ఎలా రాయాలో తెలీటం లేదు. కాని రాయక తప్పదు. ఇదివరకు ఆ మేడమీది గదుల్లో నా కొడుకుండేవాడు. ఆ గదులంటే వాడికి ఎంతో ఇష్టం. గోడలకి ఆ గులాబీరంగు వేయించింది కూడా వాడే ! కాని రెండేళ్ళకే, నా ఇరవై రెండేళ్ళ కొడుకు ఎమ్మే రెండో ఏళ్ళో వుండగా నన్నూ, ఆ గదుల్నీ వదిలేసి వెళ్ళిపోయాడు.

ఇప్పటిదాకా అవెవ్వరికీ అద్దెకివ్వలేదు, ఇవ్వదల్చుకోలేదు. కాని నిన్ను చూస్తే, నా రామమే జ్ఞాపకమొచ్చాడు. నిన్ను ఆ గదిలో వుంచగలిగితే రామాన్ని నీలో కొంతమట్టుకైన చూచుకోవచ్చని నా ఆశ ! మొదటిరోజునే నే చెప్పేది పూర్తిగా వినకుండా వెళ్ళిపోయావు. మరి అటుపక్క రానేలేదు. నిన్న మళ్ళీ వచ్చావు. నీ కోసం ఎదురు చూసిన కళ్ళు నిన్ననే వెలిగేయి. వెంటనే 'అమ్మగార్ని' తీసుకు వచ్చేసెయ్ !

రామం ఫోటోకూడా దీన్తో పంపుతున్నాను; ఒకమారు చూడు. ఇంతకన్న చెప్పలేని బాధబాబూ ఇది....! ఆలోచనల్లో వుత్తరం రాయడం ఆలస్యమైపోయింది. అర్థం చేసుకుంటావు కదూ! ఇంతే వుంటాను....

—రాఘవరావు."

వుత్తరం చదివాక 'రామం' ఫోటో చూసేడు భానుమూర్తి. తన పోలికలే బాగా వున్నాయి. అవే కళ్ళు, అదే నవ్వు. అప్రయత్నంగా కళ్ళు మూసుకున్నాడు భానుమూర్తి.

"అమ్మా, వెళ్ళిపోదం పద. ఇల్లూ మంచితోడూ అక్కడ దొరికేయి...." అన్నాడు భానుమూర్తి.

కొంచమర్థమైనా- ఇంకొంచెం అర్థంకాక "అలాగే నాయనా!" అంది వాళ్ళమ్మగారు.

* * *

రైలుదిగి రిక్షాలో అమ్మని తీసుకొని వచ్చేస్తున్నాడు భానుమూర్తి- అమ్మచేతి తియ్యని లడ్డుండలూ, రోజూ వండే వంటలూ, గులాబీ రంగు గోడలూ, మేడమీది గదులూ, రాఘవరావుగారి ఆప్యాయతా, ఆయనకి వీలైనంత సంతృప్తి కలిగించబోయే భవిష్యత్తూ, ఇవన్నీ అతనిమెదళ్ళో జోకెడు ఆనందాన్ని, కాసింత జాలినీ రేకెత్తిస్తున్నాయి.

రోడ్డుమీద ఎక్కడబడితే అక్కడ నీటిగుంటలు చిన్న చెరువుల్లా వున్నాయి. ఎండలో అవి కొత్తరకంగా మెరుస్తున్నాయి.

"ఏవయ్యా, వర్షాలు పడ్డాయా?" అని రిక్షావాణ్ణి అడిగాడు భానుమూర్తి.

"ఔను బాబూ. కుంభవృష్టిగా కురిసినై. మునుపెప్పుడూ ఇంత జోరుగా కురవలేదు" అన్నాడు రిక్షావాడు.

రిక్షా జోరుగా వెళ్తోంది. ఎండలో మెరుస్తున్న నీళ్ళు పైకి అందంగా చిమ్ముతున్నాయి.

"మేడ దగ్గిర కొచ్చేస్తున్నామమ్మా" అన్నాడు భానుమూర్తి సంతోషాన్నాపుకోలేక, రిక్షా టర్నింగు తిరిగింది.

"ఏయ్ ఆపు." గట్టిగా అరిచేడు భానుమూర్తి.

అతని కళ్ళెదురుగా వున్న దృశ్యాన్ని అతను నమ్మలేకపోయేడు. పీడకలలన్నీ ఒక్కసారిగా నిజమైనట్టనిపించింది. కళ్ళలోకి నిప్పులు ఒక్కమ్మడిగా దూకినట్లయింది. గులాబీరంగు గోడలున్న గదులు రెండింటితో మేడ పయి అంతస్తు కూలిపోయి వుంది. కింద అంతస్తు బాగానేవుంది. అప్పుడు సగం పున్నపు వెన్నెలతోబాటు ఘోరోపక్క భయంకరమైన చీకటి ముసిరినట్టయింది.

భానుమూర్తి రిక్షా దిగడం మర్చిపోయాడు. "ఈ మేడ....?"

"మొన్న వర్షాలకి కూలిపోయింది బాబూ! ఆ ఇల్లాయన.... మా దొడ్డపెబువు- సచ్చిపోయినాడు దూలంకిందపడి, కొడుకుని తల్సుకుంటూ. ఎప్పుడూ ఎల్లడు కాని ఆయాలే ఆ మేడగదిలో కెళ్ళేడు. దూలం కింద పడి, పేనం ఒగ్గేసేడు- మా దొడ్డ పెబువు. మంచోల్లకే ఇన్ని బాదలు బాబూ!"

భానుమూర్తి తలను వెనక్కి వాల్చేడు. కన్నీళ్ళు కళ్ళలో తళుక్కున మెరిసి, బుగ్గలమీదుగా జారిపోతున్నాయి.

"భానూ" అంది వాళ్ళమ్మ చాలా గాభరాగా.

"రిక్షా పోనీమంటారా బాబూ" అన్నాడు రిక్షావాడు.

"ఊఁ"

కూలిపోయిన 'మేడ' వెనక్కీ, రిక్షా ముందుకీ జరిగిపోయేయి.